క్లుప్తంగా

శ్రీవారికి విశేష పూజలు



భక్తుల నుంచి స్వామివారి పట్టు వస్త్రాలు అందుకుంటున్న పండితులు

యానాం: హంసవాహన కాపు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో యానాంలో కొలువైన శ్రీ భూ సమేత వేంకటేశ్వర స్వామివారి 23వ బ్రహ్మోత్సవాల రెండో రోజు గురువారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. స్వామికి సువర్ణ పుష్పార్చన, ముత్యాల హారతి, సహస్ర నామార్చన, సాయంత్రం ప్రత్యేక అర్చన కార్యక్రమాలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని, విశేష పూజల్లో పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయ స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న మాధవి, కేంద్రీయ విద్యాలయ రీజినల్ బృంద సభ్యులు

అల్లవరం: ఓడలరేవులో కేంద్రీయ విద్యాలయ నిర్మాణానికి అవసరమైన భూమిని నలుగురు కేంద్రీయ విద్యాలయ ప్రాంతీయ బృంద సభ్యులతో కలిసి డీఆర్ఓ కె.మాధవి గురువారం పరిశీలించారు. సముద్ర తీరానికి సమీపంలో గతంలో గుర్తించిన స్థలాన్ని, అలాగే గ్రామానికి ఆనుకుని మెరైన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న మరో స్థలాన్ని బృందం సభ్యులు పరిశీలన చేశారు. సముద్ర తీరానికి దగ్గరలో ఉన్న స్థలం మూడొంతులు సీఆర్‌జెడ్ పరిధిలో ఉన్నట్లు రెవెన్యూ అధికారులు వారికి వివరించారు. కేంద్రీయ విద్యాలయ నిర్మాణానికి కావాల్సిన స్థల సేకరణకు అవసరమైన నిధులు ఇప్పటికే మంజూరయ్యాయి. స్థలాన్ని ఖరారు చేస్తే కేంద్రీయ విద్యాలయ నిర్మాణానికి అడుగులు ముందుకుపడతాయి. స్థల పరిశీలన చేసిన కేంద్రీయ విద్యాలయ బృందం వెంట తహసీల్దార్ నరసింహారావు, సర్పంచ్ మల్లాడి ఉమామహేశ్వరరావు, సర్వేయర్, వీఆర్వో తదితరులు ఉన్నారు.

జ్యోతిర్లింగాల ఊరేగింపు



నల్లమిల్లిలో జ్యోతిర్లింగాలతో ఊరేగుతున్న భవానీ సేవా సమితి సభ్యులు

అమలాపురం రూరల్: నల్లమిల్లిలో ఉన్న మురళీకృష్ణ స్వామి ఆలయం వద్ద దుర్గా వీరభద్ర భవానీ పీఠం భవానీలు జ్యోతిర్లింగాల ఊరేగింపు గురువారం ఘనంగా నిర్వహించారు. జై భవానీ సేవా సమితి అధ్యక్షుడు అర్లపల్లి ముత్యం గురు భవానీ ఆధ్వర్యంలో నల్లమిల్లి గ్రామంలో భవానీ నామం మార్మోగింది. భవానీలు భక్తిశ్రద్ధలతో నిప్పుల గుండం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కల ఫలించే వేళ

- మారనున్న నగర పంచాయతీ రూపురేఖలు
- ఆమోదం పొందిన ముమ్మిడివరం మాస్టర్‌ప్లాన్
- విశాలమైన రోడ్లతో పాటు, ఆధునిక వసతులు !
- ఒకటిన్నర దశాబ్దాల్లో అన్ని హంగులు



ముమ్మిడివరం నగర పంచాయతీ వ్యూ

ముమ్మిడివరం: ఓ ఆధ్యాత్మిక కేంద్రం ముమ్మిడివరం. నాలుగు దశాబ్దాలు కఠోర తపస్సు చేసిన భగవాన్ బాలయోగీశ్వరుల వల్ల ఆ ప్రాంతానికి అంతార్జాతీయ ఖ్యాతి లభించింది. నియోజకవర్గ కేంద్రమైన ముమ్మిడివరం 30 ఏళ్లుగా మేజర్ పంచాయతీగా ఉన్నా.. ఆశించిన అభివృద్ధికి నోచుకోలేదు. తొమ్మిదేళ్ల క్రితం ముమ్మిడివరం నగర పంచాయతీగా మారడం, జిల్లా విభజనతో ఈ ప్రాంతం కొత్త పుంతలు తొక్కుతోంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు సంబంధించిన ప్రధాన ప్రభుత్వ శాఖల కార్యాలయాలు ముమ్మిడివరంలో ఏర్పాటు కావడంతో ఈ ప్రాంతానికి ప్రాధాన్యమేర్పడింది. దీనికి తోడు ముమ్మిడివరం 20 ఏళ్ల భవిష్యత్తు ప్రణాళిక కోసం మాస్టర్ ప్లాన్‌కూ ఆమోదం లభించింది. దీంతో ముమ్మిడివరం రూపురేఖలు మారనున్నాయి. సువిశాల రోడ్లు, రెసిడెన్షియల్ ఏరియా, గ్రీన్‌బెల్ట్, ఇండస్ట్రియల్ జోన్ వంటి అధునాతన సదుపాయాలు సమకూరనున్నాయి. దీంతో పలు కార్పొరేట్ సంస్థలు ఇక్కడ వ్యాపారాలు స్థాపించేందుకు అవకాశం ఏర్పడుతుంది.

పూర్వాపరాలిలా..

ముమ్మిడివరం నగర పంచాయతీ 26 చదరపు కిలోమీటర్లలో విస్తరించి గ్రామీణ ప్రాంతాలతో మిళితమై ఉంది. కనీసం అంతర్గత రోడ్లు కూడా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మేజర్ పంచాయతీగా ఉన్న ముమ్మిడివరం 2013లో నగర పంచాయతీగా రూపాంతరం చెందింది. తర్వాత ప్రజలపై పన్నుల భారం పడింది మినహా అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉంది. 2021లో నగర పంచాయతీలో వైఎస్సార్ సీపీ సారథ్యంలో పాలకవర్గం ఏర్పడింది. అప్పటి ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ చొరవతో ముమ్మిడివరం అభివృద్ధిపై దృష్టి సారించారు. నగర పంచాయతీని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో 20 ఏళ్ల కాల పరిమితితో మాస్టర్‌ప్లాన్‌ను కౌన్సిల్ ఆమోదంతో ప్రభుత్వానికి నివేదించారు. దీనికి ప్రభుత్వ ఆమోద ముద్ర కూడా లభించింది. ఈ మేరకు ఇటీవల నగర పంచాయతీ కార్యాలయానికి అప్రూవల్స్ అందాయి. ముమ్మిడివరంలో 216 జాతీయ రహదారిని ఆనుకుని 10 నుంచి 15 అడుగులుగా ఉన్న రోడ్లను 40 అడుగులకు విస్తరించనున్నారు. రెసిడెన్షియల్ ఏరియా, అంతర్గత రోడ్లు ఏర్పాటు కానున్నాయి. ఇండస్ట్రియల్ జోన్, కమర్షియల్ కారిడార్ల ఏర్పాటు, గ్రీన్ బెల్ట్(పార్కులు) తదితర ప్రణాళికలు మాస్టర్‌ప్లాన్‌లో పొందుపరిచారు. దీంతో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.



మాస్టర్‌ప్లాన్ మ్యాప్

అందమైన నగరంగా తీర్చిదిద్దుతాం



మాస్టర్ ప్లాన్ ద్వారా ముమ్మిడివరం నగర పంచాయతీని అందమైన నగరంగా తీర్చిదిద్దుతాం. ప్రజా ప్రతినిధులు, అధికారుల ప్రోత్సాహంతో మాస్టర్ ప్లాన్‌కు ఆమోదం లభించింది. రాబోయే 16 ఏళ్లలో అన్ని హంగులతో ఉన్న నగర పంచాయతీగా ముమ్మిడివరం రూపుదిద్దుకుంటుంది.

– కమిడి ప్రవీణ్‌కుమార్, చైర్మన్, నగర పంచాయతీ, ముమ్మిడివరం

అన్ని హంగులతో మాస్టర్ ప్లాన్



26 చదరపు కిలోమీటర్లు విస్తరించి ఉన్న ముమ్మిడివరం నగర పంచాయతీని పట్టణ స్థాయి హంగులతో కూడిన మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించారు. మాస్టర్‌ప్లాన్‌లో ప్రజలకు అనువైన రెసిడెన్షియల్ ఏరియా, కమర్షియల్ కారిడార్, గ్రీన్‌బెల్ట్, ఇండస్ట్రియల్ జోన్, విశాలమైన రహదార్లు వంటి సౌకర్యాలు సమకూరేలా ప్రణాళికలు సిద్ధం చేశాం.

– పి.రవివర్మ, కమిషనర్, ముమ్మిడివరం

అధినేతను కలిసిన కాశి



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కాశి రామకృష్ణ

ముమ్మిడివరం: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కాశి రామకృష్ణ తాడేపల్లిలో కలిశారు. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని నిర్దేశించినట్టు రామకృష్ణ తెలిపారు.

'నాలుగేళ్లయినా పూర్తి చేయరా?'

యానాం: గిరియాంపేటలో 2021లో నిర్మాణం ప్రారంభించిన డాక్టర్ అబ్దుల్‌కలామ్ ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణం నాలుగేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు పూర్తి కాకపోవడంపై కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తానని పుదుచ్చేరి కాంగ్రెస్ ఎంపీ వైథిలింగం తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కళాశాల నిర్మాణం పూర్తి కాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రధాని ప్రత్యేక నిధులతో ప్రారంభించిన ఈ కళాశాల నిర్మాణం పూర్తి కాకపోవడం విచారకరమన్నారు.

స్వచ్ఛ యానాం లక్ష్యంగా పనిచేయాలి



విద్యార్థినులు వేసిన ముగ్గుల వద్ద అంకిత్‌కుమార్, అధ్యాపకులు

- ఆర్‌ఏవో అంకిత్‌కుమార్

యానాం: ప్రతి ఒక్కరూ స్వచ్ఛ యానాం సాధనే లక్ష్యంగా పనిచేయాలని, ఆ దిశగా అన్ని శాఖలు తమ వంతు పాత్రను పోషించాలని ఆర్‌ఏవో, ఐఏఎస్ అధికారి అంకిత్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛ ఉత్సవ్‌ను పురస్కరించుకుని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో విద్యార్థినులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. కళాశాల విద్యార్థినులు, అంబేడ్కర్ పాలిటెక్నిక్ విద్యార్థినులు, గిరియాంపేట పెరుంతలైవార్ కామరాజర్ ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థినులు సుమారు వంద మంది ముగ్గుల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో అరణ, కె.పావని, మల్లిక ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శాంతికుమార్, ఏఈ కాళ్ల జ్యోతిరాజు, దేవానంప్రియ, అధ్యాపకులు ఉమాదేవి, శ్రీదేవి, క్వాజాబి, పీడీ రమేష్ పాల్గొన్నారు.

వితరణశీలి సత్యనారాయణకు సత్కారం

అమలాపురం టౌన్: పట్టణానికి చెందిన వితరణ శీలి, కిరాణా వర్తక హోల్‌సేల్ వ్యాపారి రేపాక సత్యనారాయణకు స్థానిక వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధర్మకర్తల మండలి చైర్మన్ కంచిపల్లి అబ్బులు, ఈవో యర్రా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం అభినందన సత్కారం జరిగింది. పలు సేవా కార్యక్రమాలతో పాటు, దేవస్థానానికి దాతగా సేవలందించిన సత్యనారాయణ విజయ దశమి సందర్భంగా వేంకటేశ్వరస్వామి వారిని రూ.2 లక్షల కరెన్సీతో అలంకరించనున్నట్టు చైర్మన్ అబ్బులు తెలిపారు. ఈ నెల 27 నుంచి విజయ దశమి రోజైన అక్టోబర్ 2 వరకూ స్వామికి కరెన్సీ అలంకరణ ఉంటుందని చెప్పారు. అలాగే దేవస్థానంలో అన్నదాన సత్రం పక్కన అదనపు షెడ్డు నిర్మాణానికి సత్యనారాయణ ముందుకురావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో దేవస్థాన మాజీ చైర్మన్ కర్రి దత్తుడు, పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, మాజీ కౌన్సిలర్ తిక్కిరెడ్డి నేతాజీ, దేవస్థానం ప్రధానార్చకుడు పెద్దింటి నరసింహాచార్యులు పాల్గొన్నారు.



సత్యనారాయణను సత్కరిస్తున్న చైర్మన్, ఈవో తదితరులు

పారిశుధ్య కార్మికులకు సత్కారం



సీతారామపురంలో పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న నాయకులు

తాళ్లరేవు: స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా పంచాయతీల్లో పలు కార్యక్రమాలు నిర్వహించారు. మండల కేంద్రమైన తాళ్లరేవులో సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీదేవి నేతృత్వంలో ర్యాలీ నిర్వహించారు. అలాగే కోరంగి పంచాయతీ సీతారామపురం మరిడమ్మ ఆలయం వద్ద పంచాయతీ కార్యదర్శి వీజేవీ రమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. వారి సేవలను శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు, సర్పంచ్ పెయ్యల మంగేష్ తదితరులు కొనియాడారు.

అరిగెల సేవలు ప్రశంసనీయం



అధ్యాపకుడు డాక్టర్ అరిగెలను సత్కరిస్తున్న అధ్యాపక బృందం

యానాం: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణితశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ అరిగెల వీవీఎస్ మూర్తి విద్యా సేవలు ప్రశంసనీయమైనవని ప్రిన్సిపాల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి అన్నారు. గణిత శాస్త్రంలో జేఎన్‌టీయూకే పీహెచ్‌డీని ప్రదానం చేసినందుకు గురువారం ఆయనను కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. సురక్షిత గుప్తీకరణ కోసం సమర్థవంతమైన గ్రూప్‌కు నిర్వహణా పథకాలు అనే అంశంపై ఆంధ్రా వర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, మేథమెటిక్స్ ప్రొఫెసర్ వాసుదేవరెడ్డి మార్గదర్శకత్వంలో పరిశోధన పత్రాన్ని జేఎన్‌టీయూకేకు సమర్పించినట్టు అరిగెల తెలిపారు.

జంక్ ఫుడ్‌తో క్యాన్సర్‌కు అవకాశం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ బాలరాజు

అల్లవరం: ఎక్కువగా జంక్ ఫుడ్ తినడం ద్వారా క్యాన్సర్ బారిన పడే అవకాశాలున్నాయని గోడిలంక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బాలరాజు అన్నారు. వీటితో పాటు పొగాకు, సిగరెట్, ఖైనీ, గుట్కా తదితర హానికర పదార్థాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. స్వస్థ్ నారీ సశక్తి పరివార్ కార్యక్రమంలో భాగంగా దేవగుప్తం సచివాలయం వద్ద సర్పంచ్ సాధనాల వెంకటరావు అధ్యక్షతన గోడిలంక పీహెచ్‌సీ, 104 సంయుక్తంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలరాజు మాట్లాడుతూ, ఈ కార్యక్రమం ద్వారా మహిళలకు వైద్య సేవలు అందిస్తారన్నారు. బీపీ, సుగర్, క్యాన్సర్, దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన కల్పించి, చికిత్స అందిస్తున్నామన్నారు. నిత్యం కుటుంబం కోసం ఆహర్నిశలు శ్రమించే స్త్రీ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, మహిళల ఆరోగ్యాన్ని కాపాడే బాధ్యత అందరిపై ఉందన్నారు. మానసిక ఒత్తిడిని జయించేందుకు వ్యాయామాలు చేయాలని సూచించారు. ఇంట్లోని మహిళలు ఆరోగ్యం ఉంటే ఆ కుటుంబం ఆరోగ్యం ఉంటుందని వివరించారు. అనంతరం మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ముత్తాబత్తుల రాంబాబు, కుడుపూడి సూర్యప్రకాశరావు, కాశి బాలయోగి, కార్యదర్శి శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉన్నీసా, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గౌతమీ నగర్‌లో వైద్య శిబిరం

అమలాపురం రూరల్: పేరూరు పీహెచ్‌సీ పరిధిలోని గౌతమీనగర్‌లో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాన్ని సర్పంచ్ దాసరి అరుణా డేవిడ్ గురువారం ప్రారంభించారు. అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో పౌష్టికాహార స్టాల్ ఏర్పాటు చేశారు. వైద్యాధికారి డాక్టర్ రాహుల్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అన్నపూర్ణ పాల్గొన్నారు. చిందాడగరువులో వైద్య శిబిరాన్ని ఎంపీటీసీ మోటూరి కనకదుర్గ వెంకటేశ్వరరావు, రోళ్లపాలెం సొసైటీ అధ్యక్షుడు మట్టా మహలక్ష్మి ప్రభాకరరావు ప్రారంభించారు. వైద్య నిపుణులు పి.సురేష్‌బాబు, పేరూరు వైద్యాధికారి డాక్టర్ రమ్య శైలజ స్థానికులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అన్నపూర్ణ ఆధ్వర్యంలో పౌష్టికాహార స్టాల్ ఏర్పాటు చేశారు.

ఎస్సీ రైతుల భూములకు రహదారి నిర్మాణం

యానాం: నియోజకవర్గ శివారు పరంపేట ఎస్సీ ఫీల్డ్‌లేబర్ సొసైటీ భూములకు వెళ్లే రహదారిని ప్రముఖ వ్యాపారి తోట రాజు ఆర్థిక సహకారంతో నిర్మించినందుకు స్థానిక రైతులు గురువారం ఆయనకు అభినందనలు తెలిపారు. గత 15 ఏళ్లుగా ఎస్సీ రైతుల భూముల వద్దకు వెళ్లేందుకు దారి లేకుండాపోయిందని, వరదలు రావడంతో మరింత పాడైందన్నారు. సమస్యపై స్పందించి తోటరాజు రహదారిని నిర్మించడం అభినందనీయమన్నారు. అనంతరం తోటరాజు రహదారిని ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు నందికి భాస్కరశ్రీనివాస్, ఉంద్రు ప్రభుదాసు, బడుగు నారాయణమూర్తి పాల్గొన్నారు.

బ్రహ్మార్పణ్ పథకానికి వెయ్యి రోజులు పూర్తి



భోజనం క్యారేజీ అందిస్తున్న మంగతాయారు, క్లబ్ ప్రతినిధులు



రమణమ్మను సత్కరిస్తున్న క్లబ్ ప్రతినిధులు

- ఘనంగా లయన్స్ సేవా మహోత్సవం

తాళ్లరేవు: ఎటువంటి ఆదరణ లేని అభాగ్యులకు ప్రతి రోజు ఇంటి వద్దకే భోజనం అందించే కొప్పిశెట్టి లక్ష్మయ్య బ్రహ్మార్పణ్ లయన్స్ ట్రస్ట్ ఉచిత అభాగ్యుల పథకానికి వెయ్యి రోజులు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా గురువారం తాళ్లరేవు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి క్లబ్ పూర్వ జిల్లా గవర్నర్ మాటూరి మంగతాయారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మూడేళ్ల క్రితం ప్రారంభించిన ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగడంపై ఆనందం వ్యక్తం చేశారు. అభాగ్యులకు ప్రతిరోజూ ఇంటి వద్దకే క్యారేజీని అందించేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. అలాగే లక్షలాది రూపాయలతో శ్మశాన వాటికను అభివృద్ధి చేయడం మంచి కార్యక్రమమన్నారు. తొలుత స్థానిక జిల్లావారిపేటలో ఓ అభాగ్యునికి ఇల్లు నిర్మించేందుకు ఆమె శంకుస్థాపన చేశారు. అనంతరం అభాగ్యులకు భోజన క్యారేజీలు అందజేశారు. అనంతరం లయన్స్ క్లబ్ హాలులో జరిగిన కార్యక్రమంలో బ్రహ్మార్పణ్ పథకంలో భాగంగా ఒక్క రోజు కూడా విరామం లేకుండా ప్రతిరోజూ వంట చేసిన గుత్తుల రమణమ్మను మంగతాయారు, జీఈటీ బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఇద్దరు నిరుపేదలకు కుట్టు మెషీన్లు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు పొన్నాడ పేరయ్యరాజు, కార్యదర్శి పీఎస్ ప్రసాదరెడ్డి, కోశాధికారి కట్టా ఆదినారాయణ, నున్న దత్తు, చోడే శ్రీనివాస్, సతీష్‌రాజు, బూరిబాబు, భగవాన్, శ్రీను, సూర్యనారాయణరాజు, వాడ్రేవు వీరబాబు, చలపతి తదితరులు పాల్గొన్నారు.

కాత్యాయనీ దేవిగా అమ్మవారు

ముమ్మిడివరం: శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు గురు వారం అమ్మవారు కాత్యాయనీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వాడవాడలా కనకదుర్గమ్మ ఆలయాల్లో అమ్మవారిని కాత్యాయనీ దేవిగా అలంకరించి, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ముమ్మిడివరంలో కుమ్మర్ల వీధి, మార్కెట్ సెంటర్, మెయిన్ రోడ్డు, రాజుపాలెం, గోదశివారిపాలెం, క్రాప చింతలపూడి, సోమిదేవరపాలెం, అయినాపురం, చిన కొత్తలంక, పల్లవారిపాలెం, లక్ష్మీదేవి లంక, మార్కెట్ సెంటర్‌లోని అమ్మవారి ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

దుర్గమ్మ ప్రత్యేక పూజలు

ఉప్పలగుప్తం: దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకుని మండలంలోని గ్రామాల్లో దుర్గమ్మ అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. మండలంలోని చల్లపల్లి గ్రామ దేవత మరిడి మహాలక్ష్మి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. సన్నవిల్లిలో దుర్గమ్మ వారిని కాత్యాయనీ అవతారంలో అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

లలితాదేవి అలంకరణలో..

యానాం: శరన్నవరాత్ర మహోత్సవాలను పురస్కరించుకుని స్థానిక గోపాల్‌నగర్‌లో కొలువైన శారదాదేవి(సరస్వతీదేవి) అమ్మవారు గురువారం లలితాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా చేకూరి పద్దరాజు దంపతుల సౌజన్యంతో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా కలశ పూజ

అమలాపురం టౌన్: విజయ దశమి శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయం వద్దనున్న అమ్మవారి కల్యాణ మండపంలో 102 మంది ఆర్య వైశ్య కన్యలతో కలశ పూజ గురువారం వైభవంగా జరిగింది. అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకృతులయ్యారు. కలశ పూజ అనంతరం 102 మంది కన్యలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి అలంకరణకు ఎండూరి సత్యనారాయణ (చంటి), వారి కుమారుడు పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో లలితా భక్తి మండలి వారి సామూహిక లలితా పారాయణ సాగింది. పట్టణ వైశ్య సంఘం అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి, ఉత్సవ కమిటీ చైర్మన్ అప్పన వీరన్న, సలహాదారులు వంకాయల కాశీ, వరదా సూరిబాబు తదితరులు పర్యవేక్షించారు.



యానాంలో లలితాదేవి అలంకరణలో శారదాదేవి



పల్లవారిపాలెం ఆలయంలో కాత్యాయనీ దేవిగా అమ్మవారు



అమలాపురం వాసవీమాత ఆలయంలో కలశ పూజలో పాల్గొన్న ఆర్యవైశ్య కన్యలు



సన్నవిల్లిలో కాత్యాయనీ అవతారంలో..



చల్లపల్లిలో మరిడి మహాలక్ష్మి అమ్మవారు